క్లుప్తంగా

చీరల వేలం.. ఆలయానికి ఆదాయం

పలమనేరు: పట్టణంలో శ్రీ తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను శుక్రవారం వేలం నిర్వహించారు. తద్వారా ఆలయానికి రూ.42,600 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కమలాకర్ తెలిపారు. ఆలయ అధికారులు, పట్టణ పెద్దల సమక్షంలో వేలం నిర్వహించినట్టు చెప్పారు.

నేడు కల్యాణోత్సవం

సదుం: మండలంలోని పొట్టింవారిపల్లె సీ రామస్వామి ఆలయంలో శనివారం . సాయంత్రం గణపతి పూజ, హోమాలు, సీతారామ కల్యాణోత్సవం, పుష్పపల్లకి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. అలాగే భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



మారెమ్మ

పుంగనూరు: పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అనపకాయలతో చేసిన పితికిపప్పుతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

హంస వాహనంపై కళ్యాణ రాముడి కటాక్షం

బైరెడ్డిపల్లి: మండలంలో బేలుపల్లె సమీపంలోని పట్నపల్లె కొండపై ఉన్న శ్రీ కళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం హంస వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం సాయంత్రం హంస వాహన సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణవెంకట్రమణస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. ఆలయం చుట్టూ, గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షించి మందులు అందజేస్తున్న వైద్యులు

సదుం: స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అశ్విని హాస్పిటల్ (పీలేరు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించినట్టు నిర్వాహకుడు, వైస్ సర్పంచ్ బాబురెడ్డి తెలిపారు. డాక్టర్లు అశ్విని రెడ్డి, శ్రమంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సయ్యద్‌బాషా, ఖమ్రుద్దీన్, రెడ్డెప్పరెడ్డి, ఇందాద్, ఆనందరెడ్డి, వెంకటరమణ, రమణారెడ్డి పాల్గొన్నారు.

కిశోర బాలికలు శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య

తవణంపల్లె: కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.లావణ్య అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని అరగొండ అంగన్‌వాడీ కేంద్రంలో మాసోత్సవాలను నిర్వహించారు. లావణ్య మాట్లాడారు. కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యం, పరిశుభ్రతపై వివరించారు. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే శాకాహార, మాంసాహారం ఏదైనా తినవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గంగమ్మకు అభిషేకం

శ్రీ రంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లెలో ఉన్న ఆరిమాను గంగమ్మకు ఘనంగా అభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపొందాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా చొక్కా గోవిందయ్య మాట్లాడుతూ సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ సుభిక్షంగా ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కటిక పల్లి సర్పంచ్ మార్కొండయ్య, శరత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీ కేర్ ఫుల్ డేంజర్.. డేంజర్..

- ప్రమాదాలకు నెలవుగా మారిన చెరువులు, గుంతలు
- వర్షాలకు గుంతల్లోనూ చేరిన నీరు
- కైగల్ జలపాతంలో మృత్యులోయ
- కౌండిన్యలోనూ పలు ప్రమాదకర ప్రాంతాలు
- వేసవి వస్తే..ప్రాణాల మీదకు తెస్తున్న ఈత సరదా



చెరువులో ఇటుకల కోసం మట్టిని తోడేసిన గుంతలోకి చేరిన వర్షపు నీటిలో ఈత కొడుతున్న పిల్లలు

పలమనేరు: విద్యార్థులకు వేసవి సెలవులొస్తున్నాయంటే తల్లిదండ్రులు ఒకింత ఆందోళన చెందాల్సి వస్తోంది. పిల్లల వినోదం, సరదా కాస్త విషాదంగా మారిన ఎన్నో సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. చెరువులు, కుంటలు, అడవుల్లోని గుంతలు ఏటా వేసవి సెలవుల్లో యువత, చిన్నారుల ప్రాణాలను హరిస్తున్నాయి. 4 రోజుల క్రితం వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురంలో తల్లి ముందే ముగ్గురు అక్కాచెల్లెళ్లు దీపాలను చెరువులోకి వదిలేందుకు వెళ్లి నీట మునిగి మృతిచెందిన సంఘటన జిల్లా ప్రజలను కలచివేసింది. ప్రస్తుతం జిల్లాలో కురిసిన వర్షాలకు చెరువులు, గుంతలకు నీరు చేరింది. వేసవి సెలవుల్లో నీటిలో ఆడుకోవడం కోసం వెళ్లే పిల్లలు, యువకుల విషయంలో తల్లిదండ్రులు ఒకింత అప్రమత్తంగా ఉండవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఏడేళ్లలో 34 మంది నీళ్లలో మునిగి మృతి

ఏడేళ్ల కాలంలో పలమనేరు నియోజకవర్గంలో 25 మంది నీటిలో మునిగి మృతి చెందారు. గతంలో పట్టణానికి చెందిన కొందరు విద్యార్థులు చెరువులో ఈతకెళ్లగా ఓ యువకుడు మృతి చెందాడు. పట్టణానికి చెందిన ఓ బాలుడు కాలువపల్లె జలాశయంలో నీట మునిగి మృతి చెందాడు. ఇక గ్రామాల సమీపంలోని పలు చెరువుల్లో ఇటుకల కోసం లేదా ఇతర అవసరాల కోసం అక్రమార్కులు మట్టిని తోడేశారు. సంబంధిత చెరువు లేదా కుంటల లోతు, లోపలి పరిస్థితుల గురించి అవగాహన లేకుండా ఈదులాడేందుకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక నీరు పుష్కలంగా ఉన్న చెరువుల కింది బావులు, అటవీ ప్రాంతానికి దగ్గరిలో ఉన్న బావులు, కట్టడపురాయి బావులకు వెళ్లి ఈతరాని వారు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ఈత సరదా చివరకు ప్రాణాలను హరిస్తోంది. మరోవైపు యువత సెలవుల్లో సరదాగా గడిపేందుకు అడవిలోని కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడున్న వాగుల్లో, చెరువుల్లో స్నానాలకు వెళ్లడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. ఇక స్థానిక జలపాతాలైన కై గల్ దుముకురాళ్ల, కళ్యాణరేవులు, గంగన్న శిరస్సు, వైఎస్ఆర్ జలాశయాల వద్ద కూడా ఇదే పరిస్థితి. ముఖ్యంగా కైగల్ వాటర్‌ఫాల్స్‌లోని మృత్యులోయ ఇప్పటికే పలువురిని పొట్టనబెట్టుకుంది. ఇక్కడి సుడిగుండం కారణంగా నీటిలోకి దిగితే మళ్లీ పైకి రావడం అంత సులభమేమీ కాదు.



ఇటీవల వర్షాలకు చెరువులో చేరిన నీరు



పలమనేరు సమీపంలోని బావుల్లో ఈదులాడుతున్న పిల్లలు

భక్తి ప్రపత్తులతో రాహుకాల పూజలు



ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి ప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. ఆలయ ఆశీర్వాద మండపంలో అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. రాహు కాల సమయంలో సాంప్రదాయరీతిలో అర్చనలు ,అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్న ప్రసాద వితరణ చేశారు.

మార్వాడీల అన్నదానం

వి.కోట: స్థానిక ఆయి మాతాజీ ఆలయ నిర్వాహకులు సిర్వి సమాజ్ ఆధ్వర్యంలో మండలంలోని మార్వాడీలు అంబేడ్కర్ కూడలి వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్వాడీలు మిల్లీ లాల్ సేట్ తదితరులు పాల్గొన్నారు.

లూజు పెట్రోల్ విక్రయించొద్దు



దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ లింగప్ప

వీ.కోట: వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ జరగాల్సి ఉందని, ఇందుకు సంబంధించి కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మండలంలోని అన్ని పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ అమ్మరాదని సీఐ లింగప్ప, తహసీల్దార్ సురేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల పెట్రోల్ బంక్ అధినేతలు క్రాకర్స్ లైసెన్స్ ఉన్న యజమానులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. పెట్రో బంకుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటర్ బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ లూజుగా ఇవ్వరాదన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటపాటలతో ఆహ్లాదం



బహుమతులు పొందిన చిన్నారులతో నిర్వాహకులు

పలమనేరు: ఆటపాటలతో పిల్లల్లో ఆహ్లాదంతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా వికసిస్తుందని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. పది రోజులుగా స్థానిక కళామందిరంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నైతిక విలువలపై వారికి వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు ఇంట్లో స్మార్ట్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఉంటూ నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేఎస్‌సీ మూర్తి, చంద్రశేఖరయ్య, సిద్ధార్థ, పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదిమంది బైండోవర్

గుడుపల్లె: వచ్చే నెల 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకుని సంగనపల్లెలో ఇరువర్గాలకు చెందిన 10 మందిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్ఐ లక్ష్మీకాంత్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఇంకా అనుమానం వచ్చిన వారిని ముందస్తుగా గుర్తించి బైండోవర్ చేస్తామన్నారు. ఎన్నికలు కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు ఎవరూ గొడవలు పడరాదని హితవు పలికారు.

అశ్విన్ కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అశ్విన్‌కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం పరామర్శించారు. ఎస్ఆర్ పురం మండలంలోని చొక్కమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అశ్విన్‌కుమార్‌రెడ్డి (37) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పనిచేస్తున్నారు. అయితే కుటుంబ కలహాలతో అతడు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి అక్కడికి వెళ్లారు. అశ్విన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సిద్దయ్య, మాజీ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు శీనయ్య, జనార్దన్, లోకనాథరాజు, కాళప్ప, బాబు, రాజా, అల్లిముత్తు తదితరులు అశ్విన్‌కు నివాళులర్పించారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 27మంది గైర్హాజరు



సప్లిమెంటరీ పరీక్షలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ సిద్ధరామయ్య

పులిచెర్ల(కల్లూరు): పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి తొలిరోజు కల్లూరు హైస్కూల్లో నిర్వహించిన తెలుగు పరీక్షకు 27మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు. పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం మండలాలకు చెందిన వారు మొత్తం 47 మంది పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. అయితే 27మంది గైర్హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ సూపర్‌వైజర్లు హరిశంకర్, మంజువాణి, అస్రూప్ పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ



సరుకు నిల్వలను సరిచూస్తున్న ఆర్డీఓ

నగరి: పట్టణ పరిధిలోని పౌర సరఫరాల గోదామును ఆర్డీఓ వెంకటరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం గోదాముకు సిబ్బందితోపాటు వెళ్లిన ఆయన ఆన్‌లైన్‌లో చూపుతున్న సరుకు నిల్వ, గోదాములో ఉన్న సరుకు నిల్వలను పరిశీలించారు. బియ్యం, పోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పామోలిన్, రాగి పిండి, గోధుమ పిండి, చక్కెర నిల్వలను విడివిడిగా లెక్కించి సరిచూశారు. సరుకుల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. చూపుతున్న నిల్వల మేరకు గోదాములో సరుకు ఉన్నట్లు తేల్చారు. సరుకులను సరైన సమయాల్లో ఆయా దుకాణాలకు సరఫరా చేయాలని గోడౌన్ డీటీకి సూచించారు. ఈ తనిఖీలో డీఎస్ఓ శంకరయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, గోడౌన్ ఇన్‌చార్జి పి.ఆదం పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలంలో గురువారం వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచే వ్యవసాయ శాఖ సిబ్బంది విత్తన పంపిణీని ప్రారంభించారు. దీంతో రైతులు క్యూకట్టారు. వేలిముద్ర సేకరణ ద్వారా రైతులకు కాయలను అందించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పంపిణీ చేశారు. తొలి రోజు ఐదు ఆర్బీకేల ద్వారా 865 మంది రైతులకు గాను 1150 బ్యాగులు అందజేశామని మండల వ్యవసాయశాఖ అధికారి వేణు తెలిపారు.

టపాసులు అమ్మితే కేసులు తప్పవు

- ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించక తప్పదు
- మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీ రమణారెడ్డి



పలమనేరు: దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

పలమనేరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలమనేరులో ఎక్కడైనా టపాకాయలను విక్రయిస్తే కేసులు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని టపాకాయల దుకాణాలు, పెట్రోల్ బంకులు, అనధికారికంగా పెట్రోలు విక్రయించే దుకాణాలపై సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో కలసి ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో పెట్రోలు నింపుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. టపాకాయలు విక్రయించే గోడౌన్ నిర్వాహకులు హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో టపాకాయలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు, గుంపులుగా జనం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్వో రవి రెడ్డి, టీపీఓ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయిస్తే క్రిమినల్ కేసులు

చౌడేపల్లె: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బాణాసంచా విక్రయించరాదని తహసీల్దార్ శివరాముడు అన్నారు. శుక్రవారం బాణాసంచా విక్రేతలు, పెట్రోల్ బంక్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదని, పల్లెల్లో పెట్రోల్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ ఫలితాల అనంతరం బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకోవడం, ర్యాలీ నిర్వహించడం చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలి

చౌడేపల్లె: గ్రామ పంచాయతీల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని డ్వామా ఏపీడీ సునీల్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఎంపీడీఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. మండలానికి కేటాయించిన లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా పనులతోపాటు గ్రామాల్లో ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. దినసరి కూలీ రూ:300 కు పెంచారని, మార్కింగ్ ఆధారంగా పనులు కల్పించి కూలీలకు వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని ఆదేశించారు. కొత్త పనులకు అంచనాలు సిద్ధం చేసి పాలనాపరంగా మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం నాగిరెడ్డిపల్లె , దిగువపల్లె, పుదిపట్ల, దుర్గసముద్రం పంచాయతీల్లో అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. సమావేశంలో జేఈ ధనుంజయుడు, టీఏలు అమరనాథ్, సయ్యద్‌బాషా, సీఓలు ప్రసాద్, భరత్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

డ్రైవర్స్ కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్



గంగవరం: రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు సీజ్ చేసిన పోలీసులు

- రికార్డులు లేని 9 ద్విచక్రవాహనాలు సీజ్



రొంపిచెర్ల: లక్ష్మీ నారాయణ కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

గంగవరం: మండలంలోని డ్రైవర్స్ కాలనీలో పోలీసులు నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ఎలాంటి రికార్డులు లేని 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు సీఐ చిన్నగోవింద్ తెలిపారు. శుక్రవారం 30 మంది పోలీసులతో సీఐ, డ్రైవర్స్ కాలనీలో ఇంటింటా సోదాలు చేశారు. రికార్డులు లేని 9 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, సమస్యాత్మక గ్రామాలు పోలీసుల ఆధీనంలో ఉన్నట్టు సీఐ చెప్పారు. కాలనీలో ఎవరైనా అనుమానితులు సంచరించినట్టు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి ఒరిజినల్ రికార్డులు చూపించి వాటిని తిరిగి పొందవచ్చన్నారు. సోదాలలో పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె ఎస్ఐలు శ్రీనివాసులు, క్రిష్ణయ్య, పోలీసులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కాలనీలో..

రొంపిచెర్ల: స్థానిక పంచాయతీలోని లక్ష్మీ నారాయణ కాలనీలో శుక్రవారం కల్లూరు సీఐ శ్రీనివాసులు, రొంపిచెర్ల ఎస్ఐ సుకుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, గ్రామంలో అనుమానితులు ఎవరైనా స్థిరనివాసం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగ వాహనాలు కొనుగోలు చేసినా, విక్రయించినా నేరమన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ర్యాలీలు, సంబరాలు నిర్వహించడం, టపాసులు కాల్చడం చేయరాదన్నారు. జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 6వ తేదీ తర్వాత సంబరాలకు, ర్యాలీలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. అనంతరం పంచాయతీలోని బజారు వీధి, పెద్దమసీదువీధి, సంత బజారు వీధులలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుకుమార్, రవి ప్రకాష్ రెడ్డి, ఏఎస్ఐలు మధు, తులసీరాం, పోలీసులు పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్.. రెండు ఆటోలు సీజ్



భవానీ నగర్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ కృష్ణారెడ్డి తదితరులు

చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లె పంచాయతీ భవానీ నగర్, శికారిపాళ్యంలో శుక్రవారం సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వేకువ జామున 5 గంటలకే ఆయా గ్రామాలకు వెళ్లి ఇంటింటా సోదాలు చేశారు. సరైన రికార్డులు లేని రెండు ఆటోలను సీజ్ చేశారు. ఒక్కసారిగా పోలీసులు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో ప్రజలు హడలిపోయారు. నేరాల నియంత్రణకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజలు సహకరించాలని సీఐ కోరారు.

పేదలందరికీ ఉచితంగా వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గ్రామ గ్రామానికి వెళ్లి పేదలందరికీ ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరం అన్నారు. ప్రజల దగ్గరకు వచ్చి సేవలందించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఉచిత వైద్యశిబిరంలో 37 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు, గర్భవతులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తవణంపల్లె పీహెచ్‌సీలోనే గర్భిణులకు ప్రసవం చేస్తున్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నేత్రి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, డిఈఓ విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు వనజ, జమున, భారతి పాల్గొన్నారు.